అన్నింటికీ ఆధార్‌మే

- ప్రతి పథకానికి ఆధార్ నంబర్ తప్పనిసరి
- లేకుంటే పోషణ ట్రాక్ యాప్‌లో నమోదు కాని చిన్నారుల వివరాలు
- ప్రత్యేక శిబిరాలతో తీరనున్న సమస్యలు
- నియోజకవర్గంలో ఆరేళ్లలోపు చిన్నారులు 18 వేల మంది



తేటగుంటలో 0-6 ఏళ్ల చిన్నారులకు ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

తుని రూరల్: ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు లైఫ్ సర్టిఫికెట్ ఎంత అవసరమో భారతదేశంలో ప్రతిఒక్కరికీ ఆధార్ కార్డు అంతే అవసరం. ఇది పరోక్షంగా లైఫ్ సర్టిఫికేట్‌లా పని చేస్తోంది. దీంతో ప్రతిఒక్కరికీ ఆధార్‌కార్డు ఆవశ్యకత పెరిగింది. గతేడాది వరకు పాఠశాలలో చేరడం నుంచి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందాలంటే ఆధార్ తప్పనిసరి అయ్యింది. ఇటీవల అంగన్‌వాడీ కేంద్రంలో చేరాలన్నా ఆధార్ కార్డు తప్పనిసరి చేయడంతో ఎంతోమంది చిన్నారుల తల్లిదండ్రులకు అవస్థలొచ్చి పడ్డాయి. అవగాహన ఉన్న తల్లిదండ్రులు ప్రైవేట్ ఆధార్ నమోదు కేంద్రాల చుట్టూ తిరిగి ఆధార్ నమోదు చేయించుకున్నారు. ప్రధానంగా ఇటీవల అంగన్‌వాడీ కేంద్రాల యాప్‌లలో చిన్నారుల పేర్లు నమోదు కాకపోవడంతో ఎంతో మంది ఇబ్బందులకు గురయ్యారు. పరిస్థితిని గమనించిన స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారుల విజ్ఞప్తితో ప్రభుత్వం 0–6 సంవత్సరాల మధ్య ఉన్న చిన్నారులకు ఆధార్ నమోదుకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో సచివాలయాల వారీగా ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా తుని మండలంలో నాలుగు రోజులుగా చిన్నారులకు ఆధార్ నమోదు ప్రక్రియ కొనసాగుతుంది.

314 అంగన్‌వాడీ కేంద్రాలు

తుని నియోజకవర్గం వ్యాప్తంగా 314 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో 18 వేల మంది ఆరేళ్ల లోపు చిన్నారులు ఉన్నారు. వీరిలో 8754 మందికి ఆధార్‌కార్డులు ఉండగా మరో 9252 మందికి ఆధార్ కార్డులు లేవు. ఆధార్ కార్డులు లేకపోవడంతో పోషణ ట్రాక్ యాప్‌లో చిన్నారులు నమోదు కావడం లేదు. దీంతో నెలవారి రేషన్ సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతేడాది వరకూ తల్లిదండ్రుల్లో ఒకరి ఆధార్ ఉంటే పిల్లలకు నమోదయ్యేది. యాప్‌ను అప్‌గ్రేడ్ చేయడంతో చిన్నారులకు ఆధార్ తప్పనిసరి అయ్యింది. దీంతో ప్రత్యేక శిబిరాలకు పిల్లలతో సహ తల్లిదండ్రులు చేరుకుని ఆధార్ నమోదు చేయించుకుంటున్నారు. వీరికి అంగన్‌వాడీ కార్యకర్తలు సమాచారం ఇవ్వడంతో పాటు ఆధార్ నమోదు కేంద్రాలకు దగ్గరుండి తీసుకువెళ్తున్నారు.

రెండు విడతల్లో శిబిరాలు



ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నాం. మొదట విడతలో 50 శాతం గ్రామాల్లో ఈ నెల 24 వరకూ శిబిరాలు కొనసాగుతాయి. రెండో విడతలో ఈ నెల 27 నుంచి 31 వరకు ఆధార్ నమోదు ప్రక్రియ కొనసాగిస్తాం. ఐసీడీఎస్ సిబ్బంది సహకారంతో చిన్నారులను గుర్తించి ఆధార్ నమోదు కేంద్రాలకు పంపిస్తున్నారు. ఆరేళ్లలోపు చిన్నారులున్న తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– కె.సాయి నవీన్, ఎంపీడీఓ, తుని



గెడ్లబీడులో చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పుతున్న అంగన్‌వాడీ కార్యకర్త



తేటగుంటలో ఆధార్ నమోదు కోసం బిడ్డలతో వేచిఉన్న తల్లులు

నియోజకవర్గం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, ఆధార్ లేని చిన్నారుల వివరాలు

మండలం	అంగన్‌వాడీ కేంద్రాలు	ఆరేళ్లలోపు చిన్నారులు	ఆధార్ లేని చిన్నారులు
తుని	87	5554	2515
తొండంగి	87	6108	3997
కోటనందూరు	51	2806	1257
తుని పట్టణం	89	3538	1483
మొత్తం	314	18006	9252

నేటి నుంచి నియోజకవర్గంలో గిరిబాబు పర్యటన



ముద్రగడ గిరిబాబు

కిర్లంపూడి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ముద్రగడ గిరిబాబును ప్రకటించిన విషయం విదితమే. ప్రత్తిపాడు ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి గిరిబాబు పార్టీ సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం, ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజలతో కలిసి రైతులకు మద్దతుగా కలెక్టరేట్, విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో గిరిబాబు ధైర్యం నింపారు. కాగా శుక్రవారం నుంచి నియోజకవర్గంలో పర్యటించి ఆత్మీయ కలయిక పేరుతో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను కలవనున్నారు. ఉదయం 10 గంటలకు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం ఆశీస్సులతో కిర్లంపూడి నుంచి బయలుదేరి అన్నవరం జాతీయ రహదారిపై సత్యదేవుని నమూనా ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటారు. అనంతరం రౌతులపూడి మండలంలో పర్యటిస్తారని తెలిపారు.

ములగపూడిలో నేడు..

రౌతులపూడి: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు నియోజకవర్గం పర్యటనలో భాగంగా శుక్రవారం తొలిసారిగా మండలంలోని ములగపూడిలో పర్యటించనున్నారు. ఈ విషయాన్ని గురువారం ఆయన విలేకర్లకు తెలిపారు. పార్టీ ముఖ్య నాయకులు, అభిమానులతో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన తన తండ్రి, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం సెంటిమెంట్‌గా భావించే ములగపూడిలో రాజకీయంగా తొలి అడుగు వేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. మండలంలోని పార్టీ ముఖ్య నేతలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

క్లుప్తంగా

మహిళా సాధికారితకు ‘ఉల్లాస్’



శిక్షణలో మాట్లాడుతున్న వయోజన విద్య నోడల్ అధికారి వెంకటరెడ్డి

రౌతులపూడి: మహిళలను విద్యావంతులను చేసి వారిలో ఆర్థిక సాధికారిత సాధించేందుకే ప్రభుత్వం ‘ఉల్లాస్’ (వయోజన విద్య)ను ప్రవేశపెట్టిందని వెలుగు ఏపీఎం నాగమణి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గురువారం ఉల్లాస్ వలంటీర్లకు, వీఓఏలకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. 15 ఏళ్ల పైబడిన నిరక్షరాస్యులైన మహిళా సంఘాల సభ్యులు, ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మిడ్డే మీల్స్ వర్కర్లు, అంగన్‌వాడీ ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌లు ,హెల్పర్లను అక్షరాస్యులుగా చేయాలని సూచించారు. అభ్యసనా వాచకాల ద్వారా బోధనతో పాటు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, క్రియాత్మక అక్షరాస్యతపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వయోజన విద్య నోడల్ అధికారి వెంకటరెడ్డి, సీసీ అప్పలకొండ, హెచ్‌డీ యాంకర్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ శ్రీలతకు అభినందనలు



సర్పంచ్ శ్రీలతను అభినందిస్తున్న అధికారులు

కిర్లంపూడి: జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సభ్యురాలిగా నియమితులైన జగపతినగరం సర్పంచ్ మహేంద్రాడ శ్రీలతకు అధికారులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం సిబ్బంది, స్థానిక నాయకులు ఆమెకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో జిల్లాలో జరిగే అభివృద్ధి పనుల పర్యవేక్షణ కమిటీలో తనకు స్థానం దక్కడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తనను ప్రోత్సహించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ పార్లమెంట్ సభ్యుడు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాళ్ల వెంకటేష్, గుడాల రాంబాబు, జూనియర్ అసిస్టెంట్ సూర్యకుమారి, బిల్లు కలెక్టర్ సోమేశ్వరావు, బాబ్జీ, శరకణం వికాశ్, మద్దాల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో కోళ్లఫారం దగ్ధం

గోకవరం: మండలంలోని అచ్యుతాపురంలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కోళ్లఫారం దగ్ధమైంది. గ్రామంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు నల్లల వెంకన్నబాబుకు చెందిన కోళ్లఫారం నుంచి మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. సమీపంలోని గుమ్మళ్లదొడ్డి హెచ్‌పీసీఎల్‌కు చెందిన ఫైరింజన్, రాజమహేంద్రవరం నుంచి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల ఆస్తినష్టం సంభవించినట్టు బాధితులు తెలిపారు.

తుని వాకర్స్ క్లబ్‌కు డిప్యూటీ గవర్నర్ పదవి

తుని: సిటీ వాకర్స్ క్లబ్‌కు జిల్లా స్థాయిలో డిప్యూటీ గవర్నర్ పదవి లభించిందని తుని వాకర్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు ఆర్ఎస్ఎన్ మూర్తి గురువారం తెలిపారు. అమలాపురంలో బుధవారం వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా క్యాబినెట్ ప్రమాణ స్వీకారోత్సవం ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో తునికి చెందిన సీహెచ్ సోమేశ్వరరావుతో డిప్యూటీ గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేయించారు. తుని శాఖ అధ్యక్షుడిగా లోకారెడ్డి అప్పారావు, ఉపాధ్యక్షుడు ఎం.శివ, కార్యదర్శిగా ఎస్‌జె రాజు, కోశాధికారిగా బి.సత్యనారాయణ, సహాయ కార్యదర్శులుగా ఎస్.వెంకటేష్, సీహెచ్.లోవరాజుతో ప్రయాణ స్వీకారం చేయించారు. వీరిని డిస్ట్రిక్ గవర్నర్ నాగేశ్వరరావు, కుచ్చర్లపాటి భీమరాజు, బి.గణేష్, మూర్తి తదితరులు అభినందించారు.

సేవాభావాన్ని అలవర్చుకోవాలి

గండేపల్లి: విద్యార్థులు బాల్యం నుంచి సేవాతత్వాన్ని అలవరుచుకోవాలని స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాస్ సూచించారు. మండలంలోని జెడ్ రాగంపేటలో ఓ ప్రైవేట్ స్కూల్ విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు తోటి వారికి సహాయపడాలన్నారు. సైబర్ నేరాలు, ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో భాగస్వాములుకావాలి

గండేపల్లి: విద్యార్థులు సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పి.కృష్ణారావు పేర్కొన్నారు. మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం మెకానికల్, డేటా సైన్స్, ఐటీ, సైబర్ సెక్యూరిటీ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పి. రాజశేఖర్, ఫణీంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రావులమ్మతల్లి సంబరాలు



రావులమ్మతల్లి సంబరాల్లో శక్తి వేషాలు



గరగ నృత్యాలు

జగ్గంపేట: కోర్కెలు తీర్చే గ్రామ దేవత రావులమ్మతల్లి సంబరాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏటా సంక్రాంతి, కనుమ రోజుల్లో రావులమ్మతల్లి జాతర మహోత్సవాలు నిర్వహిస్తారు. జాతర అనంతరం వచ్చే మంగళ, గురు, ఆదివారాల్లో సంబరాలు నిర్వహించడం పరిపాటి. దీనిలో భాగంగా గురువారం జగ్గంపేటలోని మర్రిమొక్క వీధికి చెందిన ప్రజలు ఈ ఏడాది మొట్టమొదటి సంబరాన్ని జరిపారు. ప్రతి కుటుంబం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మర్రిమొక్క వీధి నుంచి బయలుదేరిన సంబరం గ్రామంలోని ప్రధాన వీధులు మీదగా స్థానిక బస్టాండ్ వద్దకు చేరుకుంది. సంబరంలో పెద్దలు, మహిళలు, యువకులు, పిల్లలు సందడి చేశారు. సంబరాల్లో గరగ నృత్యాలు, పులివేషాలు, శక్తి వేషాలు, దేవతా మూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

ఆదర్శప్రాయుడు నేతాజీ

- ఘనంగా సుభాష్‌చంద్రబోస్ జయంతి
- జాతీయ నేతకు ఘన నివాళులు



ఏలేశ్వరంలో నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు, విద్యార్థులు

తొండంగి: నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీకే మెహర్ సూచించారు. కళాశాలలో గురువారం సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు నిర్వహించారు. చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుభాష్‌చంద్రబోస్ అజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి దేశస్వాతంత్రోద్యమంలో కీలకపాత్ర పోషించారన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందారన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పీవీ కృష్ణారావు, దివాకర్, జే.శ్రీనుబాబు, రాజశేఖర్, మల్లేశ్వరరావు, వెంకటేశ్వరులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి

ఏలేశ్వరం: స్వాతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరీటి ఆధ్వర్యంలో స్థానిక కోనేటిబడి వద్ద నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నేతాజీ ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అలమండ వీరరాఘవస్వామి తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నేత, ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కావలి శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అయోధ్యలో రామ మందిర నిర్మాణం చరిత్రాత్మక విజయం

గోకవరం: అయోధ్యలో రామ మందిరం నిర్మాణం ఒక చరిత్రాత్మక విజయమని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్ఠ చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా గోకవరంలో బీజేపీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గత ఏడాది జనవరి 22న అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్ఠ జరిగిన రోజు స్థానిక సీఎండీ ప్రాంగణంలో భారీ సమావేశం, బైక్ ర్యాలీ నిర్వహించామన్నారు. ఈ సమావేశానికి వేలాదిగా ప్రజలు తరలిరావడం గొప్ప విశేషమన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఇనకోటి బాపన్నదొర, నాయకులు మామిడి అయ్యప్ప, వరసాల ప్రసాద్, ఉంగరాల ఆదివిష్ణు, రామసేన సభ్యులు డాక్టర్ వల్లూరి జగన్నాథరావుశర్మ, కట్టా కళ్యాణ్, ఉంగరాల ఆదివిష్ణు, తదితరులు పాల్గొన్నారు.

వేమన ఆధ్యాత్మిక పద్యగ్రంథాలపై ప్రచారం



రాకూరుపాలెంలో ఆధ్యాత్మిక గ్రంథాలపై ప్రచారం చేస్తున్న జ్ఞాన వేదిక సభ్యులు

గోకవరం: వేమన రచించిన ఆధ్యాత్మిక పద్యగ్రంథాలపై మండలంలోని పలు గ్రామాల్లో త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక రాజమండ్రి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. రాకూరుపాలెం, తిరుమలయపాలెం, రంపయర్రంపాలెం, గంగంపాలెం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వేమన రచించిన పద్యాలపై ఆచార్య ప్రబోధానంద నిగూఢ తత్వార్థ బోధిని, త్రైత సిద్ధాంత భగవద్గీత అనే గ్రంథాలను రచించారన్నారు. వీటిని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ఈ ప్రచార కార్యక్రమం చేపట్టామని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక రాజమండ్రి కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు సత్యవతి, దేవి, శాంతి, శోభారాణి, సత్యనారాయణ, భరత్, అన్నవరం, ఆదిబాబు, సోమనాయుడు, వాసు తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీలపై ఎక్సైజ్ దాడులు

ప్రత్తిపాడు: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని శంఖవరం గ్రామ శివారులో సారా బట్టీలపై ఎక్సైజ్ సిబ్బంది గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 1,200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ప్రత్తిపాడు ఎక్సైజ్ సీఐ పి.శివ ప్రసాద్ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై పి.వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎంపీటీసీ సభ్యురాలి మృతి



భువనేశ్వరి (ఫైల్)

గోకవరం: మండలంలోని కొత్తపల్లికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు ముదిలి భువనేశ్వరి (46) గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో భువనేశ్వరి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో భర్త ముదిలి రాజశేఖర్ స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆమె కొత్తపల్లి 1 స్థానానికి వైఎస్సార్ సీపీ తరఫున ఎంపీటీసీగా పోటీ చేసి గెలుపొందారు. అనంతరం ఆమె టీడీపీలో చేరారు. స్థానికంగా ఓ ప్రైవేటు విద్యాసంస్థను సైతం నిర్వహిస్తున్నారు. ఆమె మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆమెకు భర్త, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఆమె మృతికి ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, ఎంపీడీఓ గోవిందు, ఇతర ఎంపీటీసీ సభ్యులు, స్థానిక నాయకులు సంతాపం తెలిపారు.

రూ.2.50 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రవి శంకర్

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం ఆదిత్య ఫార్మసీ విద్యార్థులు విశాఖలోని సినర్జీ కంపెనీలో రూ.2.50 లక్షల వార్షిక వేతనంతో ప్లేస్‌మెంట్ సాధించినట్టు ప్రిన్సిపాల్ కె.రవి శంకర్ తెలిపారు. బి.ఫార్మసీ నాల్గో సంవత్సరం చదువుతున్న 13 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్లేస్‌మెంట్ సాధించిన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

భరతమాతకు ప్రత్యేక పూజలు

ఏలేశ్వరం: రిపబ్లిక్ డే వేడుకల్లో భాగంగా పట్టణంలో గురువారం భరతమాతకు ప్రత్యేక పూజలు చేశారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారతమాతకు విశేష పూజలు నిర్వహించారు. ఫౌండేషన్ జిల్లా ధర్మప్రచారక్ ప్రడాల రాము మాట్లాడుతూ గణతంత్ర వేడుకల్లో భాగంగా ఈ నెల 26 వరకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా భరతమాతకు ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. ప్రపంచానికి నాగరికత నేర్పినది భారత దేశమని కొనియాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పడాల రాంబాబు, కూరాకుల రాజా తదితరులు పాల్గొన్నారు.

నంబి నరసింహయ్యకు ఘన నివాళి

జగ్గంపేట: ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీపీఐ (ఎంఎల్) జనశక్తి రాష్ట్ర నాయకుడు కామ్రేడ్ నంబి నరసింహయ్య వర్ధంతిని గ్రామ శివారు రంగవల్లి నగర్‌లో గురువారం నిర్వహించారు. రైతు కూలీ సంఘం, జనశక్తి నాయకులు నంబి నరసింహయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదల సంక్షేమం కోసం నంబి నరసింహాయ్య చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రైతు కూలీసంఘం రాష్ట్ర కార్యదర్శి కర్నాకులు వీరాంజినేయులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



తుని భవిత కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న నాగేశ్వరరావు

తుని రూరల్: వాతావరణ మార్పుల కారణంగా సంభవించే సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించాలని కాకినాడ జిల్లా ఐఈ కోఆర్డినేటర్, సీఎంఓ చామంతి నాగేశ్వరరావు సూచించారు. గురువారం తుని మండలం ఎస్.అన్నవరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనం, భవిత కేంద్రంలో చిన్నారుల హాజరు, పిల్లలు తయారు చేసిన ఆట వస్తువులను ఆయన పరిశీలించారు. అనంతరం మండల విద్యా వనరుల కేంద్రంలో సీఆర్పీలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులను అప్రమత్తం చేయాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో అన్ని పాఠశాలలకు అవసరమైన షూ సైజులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎంఈఓలు పరవాడ గీతాదేవి, రామకృష్ణ పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

తుని: భవిత కేంద్రంలోని చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సమగ్ర శిక్ష జిల్లా సీఎంవో చామంతి నాగేశ్వరరావు విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. తుని పట్టణం వీరవరపుపేటలోని భవిత కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. కేంద్రంలోని రికార్డులు, పిల్లలు తయారు చేసిన ఆట వస్తువులు, టీఎల్ఎం చూసి అభినందించారు. విద్యార్థులు ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంఈవో పరవాడ గీతాదేవి, మానవ వనరుల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



తొండంగిలో పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న పశుసంవర్ధకశాఖ ఏడీ దినకర్



వేలంకలో పాడి రైతులకు మందులు అందజేస్తున్న సిబ్బంది

తొండంగి: గ్రామాల్లో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కాకినాడ పశుసంవర్ధకశాఖ ఏడీ ఎం.దినకర్ సూచించారు. తొండంగిలో గురువారం నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పశువులకు చూడి నిర్ధారణ, గర్భకోస వ్యాధుల నివారణ, నట్టల నివారణకు టీకాలు వేస్తున్నట్టు తెలిపారు. 35 ఆవులు, 53 గేదెలు, 300 గొర్రెలకు నట్టల నివారణ మందు వేశారు. పశువుల్లో గర్భకోస వ్యాధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పాడి రైతులకు మినరల్ మిక్చర్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి బి.చైతన్య, వై.యశ్వంత్‌నాయుడు, గ్రామ సచివాలయాల వెటర్నరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలతో పాడి రైతులకు మేలు

కిర్లంపూడి: పశువైద్య శిబిరాలతో పాడి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ వెన్నా వినోద్ అన్నారు. మండలంలోని వేలంకలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. గెదెలు, ఆవులు, మేకలు, గొర్రెలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 25 మంది పాడి రైతులకు సీజనల్ వ్యాధి నిరోధిక మందులు ఉచితంగా అందజేశారు. పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్నవరం దేవస్థానానికి వీల్ చైర్స్ వితరణ



జిల్లా వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అందజేసిన వీల్‌చైర్స్‌తో ఈఓ వీర్ల సుబ్బారావు

అన్నవరం: సత్యదేవుని ఆలయానికి వచ్చే వయోవృద్ధులు, వికలాంగుల సౌకర్యార్థం జిల్లా వికలాంగుల, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమ శాఖ 10 వీల్ చైర్స్ గురువారం అందజేసింది. వీటిని స్వీకరించిన దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు వయోవృద్ధులు, వికలాంగుల కోసం వీటిని ఉపయోగించాలని ఆదేశించారు. దేవస్థానం పీఆర్వో డీవీ కృష్ణారావు పాల్గొన్నారు.

కృష్ణాపురంలో ఆర్డీఓ పర్యటన



కృష్ణాపురంలో రీసర్వేపై అధికారులను సూచనలిస్తున్న ఆర్డీఓ శ్రీరమణి

తొండంగి: మండలంలోని కృష్ణాపురంలో పెద్దాపురం ఆర్డీఓ శ్రీరమణి గురువారం పర్యటించారు. మండలంలోని ఐదు గ్రామాలు మినహా 10 రెవెన్యూ గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ కృష్ణాపురంలో పర్యటించారు. రీసర్వేకు సంబంధించి ముందుగా ప్రభుత్వ భూములను గుర్తించి మ్యాపింగ్ చేయాలన్నారు. అనంతరం జిరాయితీ భూముల రైతులకు నోటీసులు ఇచ్చి రీసర్వేను ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని రెవెన్యూ అధికారులను, సర్వేయర్లను ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ మురార్జీ, ఆర్ఐ రాజారావు తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

శంఖవరం: మండలంలోని మండపం, తాళ్లపాలెం, కొండ గౌరంపేట గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ డీఈ వీరభద్రరావు గురువారం తెలిపారు. విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఆయా గ్రామాల్లో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.